తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# సుమారు రూ.కోటి చీటీల సొమ్ముతో వ్యక్తి పరార్ !!



చీటీల సొమ్ము కోల్పోయిన బాధితులు

కుప్పంరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : తమ అవసరాలకు పనికి వస్తుంది కదా చీటీల రూపంలో నగదు జాగ్రత్త పరచుకుందా మనుకున్న వారికి చీటీల నిర్వాహకుడు చుక్కలు చూపించాడు. ఏకంగా కోటిరూపాయలకు పైనే ప్రజలకు నగదు చెల్లించాల్సిన అతను రెండు నెలల నుంచి కన్పించకపోవడంతో బాధితులు బుధవారం కుప్పం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సంఘటనకు సంబంధించి బాధితుల కథనం మేరకు వివరాలిలా.. కుప్పం మున్సిపల్ పరిధి అనిమిగానిపల్లికి చెందిన సహదేవన్ అనే వ్యక్తి చీటీలు నిర్వహించేవాడన్నారు. ప్రతినెలా లక్షనుంచి 15లక్షల వరకు ఇతను చీటీలు నిర్వహిస్తుండేవాడు. ఈ నేపథ్యంలో అతని వద్ద అత్తూరుకు చెందిన మునిరత్నం 22.20లక్షలు, వసనాడుకు చెందిన పార్వతమ్మ 7లక్షలు, అనిమిగానిపల్లికి చెందిన నాగమ్మ 12లక్షలు, కుప్పంకు చెందిన మంజు నాథ్ 1.50లక్షలు, బెంగళూరుకు చెందిన సుమతి 15లక్షలు, కుప్పంకు చెందిన అజ్మతుల్లా 4లక్షలు, గెరిసిబావికి చెందిన కనకరాజ్ 12లక్షలు, మురుగ 3.30లక్షల దాకా చీటీలరూపంలో సహదేవన్ వద్ద కట్టారు. అయితే గత రెండు నెలలుగా సహదేవన్ ఫోన్ పనిచేయడం లేదని బాధితులు వాపోయారు. అతని ఇంటి వద్దకు వెళ్తే కుటుంబీకులు తమను అడిగి చీటీ డబ్బులు కట్టారా అని తమనే ఎదురు తిరిగి ప్రశ్నిస్తున్నారని పేర్కొన్నారు. కూలీ, వ్యాపారాలు చేసుకుని తమ పిల్లలకు పెళ్లిళ్లు, చదువుల కోసం దాచి పెట్టిన సొమ్ముతో సహదేవన్ ఉడాయించాడని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. పోలీసు అధికారులు స్పందించి తమకు తగు న్యాయం చేయాలని కోరారు.

### మానవ, పశు నష్టం జరగకుండా
# అప్రమత్తంగా ఉండాలి

**జిల్లాలోని అన్ని మండలాల్లో కంట్రోల్‌రూమ్‌లు ఏర్పాటు**

**జాలర్లు నెల 10వరకు సముద్రంలో చేపల వేటకు వెళ్ళరాదు**

**జిల్లాలో పునరావాస కేంద్రాలు ఏర్పాటు : తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి**



తిరుపతిరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త: బంగాళాఖాతంలో తుఫాన్ ప్రభావం వల్ల తిరుపతి జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు నమోదు కానున్నాయని, అధికారులు అందుబాటులో ఉండి అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమావేశమై అన్ని మండలాల తహశీల్దార్‌లతో, ఎంపిడిఓలతో, స్పెషల్ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరేన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరేన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ తుఫాన్ దిశ మారలేదని, తప్పనిసరిగా ఏ.పి.లోనే తిరుపతి జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ముఖ్యంగా సముద్రతీర మండలాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, జాలర్లు, ఎట్టి పరిస్థితులలో ఈనెల 10వ తేదీ సముద్రంలో చేపల వేటకు వెళ్ళరాదని, నిన్నరాత్రి సమాచారం మేరకు 202 మంది జాలర్లు వేటకు వెళ్లినట్లు తెలిసిందని, అప్రమత్తం చేయడంతో 118 మంది తిరిగి వచ్చేసారని, మరో 84 మంది నేటి మధ్యాహ్నం లోపు చేరుకునే విధంగా ఆయా గ్రామ ప్రజలకు తెలియజేసి, అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాన్ కారణంగా మాన వాళికి, జంతువులకు ఎట్టిపరిస్థితులలోనే ప్రాణనష్టం జరగరాదని ఆదేశించారు. పశువులు మేతకు బయటకు వెళ్ళకుండా పశుగ్రాసం నిల్వ ఉంచుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాలోని తిరుపతి, శ్రీకాళహస్తి, సూళూరుపేట, గూడూరు రెవెన్యూ డివిజనల్ అధికారులు తమ పరిధిలో నిరంతర పర్యవేక్షణ జరగాలన్నారు. జాయింట్ కలెక్టర్ డికె. బాలాజీ మాట్లాడుతూ వాతావరణ శాఖ నుండి హెచ్చరికలు జారీ నేపథ్యంలో సమాచార వ్యవస్థ దెబ్బతినకుండా ముందుగనే సర్వీస్ ప్రొవైడర్లకు సూచనలు ఇచ్చి, అన్ని టవర్స్‌లో ఉన్న జనరేటర్స్ పని చేసేలా డీజల్ బ్యాటరీలు చెక్ చేసుకోవాలనే ఆదేశాలు ఇవ్వాలన్నారు. రేషన్‌కు సంబంధించి నిత్యవసర వస్తువులు నేటి సాయంత్రంలోపు అన్ని మండాలకు చేరే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. వి సమీక్షలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసులు, జిల్లా అధికారులు ఆర్ అండ్ బి సుధాకర్‌రెడ్డి, పంచాయతీరాజ్ ఇంజనీర్ శంకరనారాయణ, పంచాయతీ అధికారి రాజశేఖర్‌రెడ్డి, డిఎల్‌డిఓ సుశీలాదేవి, వ్యవసాయ అధికారి ప్రసాదరావు, పశుసంవర్ధకశాఖ అధికారి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# వణికిస్తున్న 'మాండూస్'

**నేటి నుండి 11వ తేదీ వరకు వర్షాలు - అధికారులు అప్రమత్తం**

**కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు - కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు**



మాండోస్ తుఫాను ముందస్తు జాగ్రత్తలపై విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్పీ

చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: బంగాళఖాతంలో ఏర్పడిన మాండూస్ తుఫాను జిల్లా ప్రజలను వణికిస్తోంది. మాండూస్ తుఫాను గురువారం తీరం దాటనుండటంతో చిత్తూరు జిల్లాలో గురువారం నుండి ఈ నెల 11వ తేదీ వరకు భారీ వర్షాలు కురవనున్నాయి. వర్షాలకు ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా జిల్లా అధికార యంత్రాంగం క్షేత్ర స్థాయి అధికారులను అప్రమత్తం చేసింది. మండోస్ తుఫాను ప్రభావంతో కురిసే వర్షాలకు ముందస్తు నష్టనివారణ చర్యలు చేపట్టడానికి కలెక్టర్ హరినారాయణన్ బుధవారం క్షేత్ర స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాను నష్టనివారణ చర్యలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలలో కల్టెర్ హరినారాయణన్ మాట్లాడుతూ మండోస్ తుఫాను ప్రభావంపై కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడుతూ తుఫాను ప్రభావం ముందస్తు చర్యలపై కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తుఫానుతో ఎక్కడైనా ఎద్దైనా విపత్తు సంభవిస్తే సత్వరం కంట్రోల్ రూమ్ నెం.94910 77356 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు. అలాగే తుఫానుతో జరిగే నష్టాలను అడ్డుకట్ట వేయడానికి మందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ శాఖ, గ్రామీణ మంచినీటి సరఫరా శాఖ, రోడ్డు, భవనాల శాఖ, వైద్యశాఖ అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అలాగే తుఫాను సమయాల్లో తక్షణ సహాయం అందించడానికి ఫైర్, పోలీసు శాఖ అధికారులను మరింత అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. అలాగే భారీ వర్షాలు నమోదు అయితే పౌరసరఫరాల శాఖ అధికారులు సైతం రంగంలోకి దిగాల్సివుండటంతో వారిని సిద్ధం చేయడం జరిగిందన్నారు. ప్రజ లెవ్వరు వాగులు, వంకలు ఎట్టి పరిస్థితుల్లోను దాటవద్దని స్పష్టం చేశారు.

### పులికాట్ సరస్సు తీరంలో
# అధికారులు అప్రమత్తం



ఇరకందీవికి తరలుతున్న సహాయ సిబ్బంది

తడ, డిసెంబర్ 7 ప్రభాతవార్త : తిరుపతి జిల్లాలో కోస్తా ప్రాంతం కలిసిన పూర్వపు నెల్లూరు జిల్లాలోని వివిధ మండలాల్లో అధికారులు పర్యటించారు. తీరప్రాంతం ఎక్కువగా ఉన్న తడ మండలంలో బుధవారం తిరుపతి జాయింట్ కలెక్టర్ డికె బాలాజీ పర్యటించారు. తహశీల్దార్ రామయ్య, ఎంపిడిఓ మురళీకృష్ణ తదితరులతో కలిసి తడకుప్పం తదితర చోట్ల ఆయన పర్యటించి అధికారులకు పలు సూచనలిచ్చారు. మండల పరిధిలోని పూరిగుడిసెలు ఉన్న ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలని చెప్పారు. తడకుప్పం సమీపంలో ఎస్టీలు నివాసం ఉన్న ప్రాంతాన్ని చూసి వారిని తడ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస ప్రాంతానికి వెళ్లాలని సూచించారు. ఇటు రెవెన్యూ, అటు మత్స్యశాఖ, సచివాలయ అధికారులు పులికాట్ జాలర్ల కుప్పాలలో వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల భారీవర్షాల సమయంలో పులికాట్ సరస్సులో ఇరకం దీవికి వెళ్లే బోటు దారితప్పిన సంఘటనల నేపథ్యంలో ముందస్తుగా ఆ దీవికి అధికారులు ప్రత్యేక బృందాన్ని పంపించారు. బుధవారం మధ్యాహ్నానికి ప్రత్యేక బోటు ద్వారా తొమ్మిది మంది ప్రభుత్వ సిబ్బంది ఇరకందీవిలోని తిరువెంకటనగర్ కుప్పాన్ని చేరుకొని అక్కడే ఉంటూ దీవి ప్రజలను అప్రమత్తం చేశారు.

# పెళ్లికి వెళుతూ పరలోకాలకు

**ట్రాక్టర్ బోల్తా : ఆరుగురి మృతి - 12 మంది తీవ్రగాయాలు**

**పూతలపట్టు మండలంలో విషాదం**






చిత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : పూతలపట్టు మండలంలో బుధవారం రాత్రి ఘోర విషాదం సంఘటన చోటుచేసుకుంది. కాణిపాకం - పూతలపట్టు రహదారిలో లక్ష్మయ్యఊరు గ్రామ సమీపంలో వివాహానికి వెళ్లడానికి కుటుంబసభ్యులు, బంధుమిత్రులు కలసి ట్రాక్టర్‌లో వెళుతుండగా డ్రైవర్ అజాగ్రత్తతో ట్రాక్టర్ బోల్తా పడింది. రహదారి పక్కన 10 అడుగుల లోతులో ట్రాక్టర్ పడిపోవడంతో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న పెళ్లిబృందం హాహాకారాలు చేస్తూ ట్రాక్టర్ ట్రాలీ కింద నలిగిపోయారు. ఈ ఘటనలో ఆరుగురు మృతిచెందగా, 12మంది తీవ్రంగా గాయపడ్డారు. మరోపదిమంది స్వల్పగాయాలతో ఈ ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాలిలా వున్నాయి. ఐరాల మండలం జంగాలపల్లి గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి సంబంధించి పూతలపట్టు మండలం జెట్టిపల్లి గ్రామంలో వివాహం నిశ్చయమైంది. పెళ్లి ముహూర్తం గురువారం తెల్లవారు జామున వుండడంతో ఐరాల మండలం జంగాలపల్లి గ్రామం నుంచి పెళ్లి మహోత్సవానికి వెళ్లడానికి బంధువులు, కుటుంబసభ్యులు 30 మంది ఓ ట్రాక్టర్‌లో బయలుదేరారు. ట్రాక్టర్ పూతలపట్టు మండలం లక్ష్మయ్య ఊరికి సమీపంలో బోల్తాపడింది. ట్రాక్టర్‌లో ఎక్కువమంది మహిళలు, పిల్లలు వున్నారు. మృతిచెందిన ఆరుగురిలో ముగ్గురు మహిళలు, ఇద్దరు పిల్లలతో పాటు ట్రాక్టర్ డ్రైవర్ వున్నాడు. రాత్రి 10.30 గంటలకు ట్రాక్టర్ బోల్తా పడడంతో అక్కడ ఏం జరిగిందనే విషయమై సందిగ్దత ఏర్పడింది. రోడ్డుకు దిగువభాగం నుంచి మహిళలు ఆర్తానాదాలు చేయడంతో రోడ్డుపై వెళుతున్న ప్రయాణీకులు ప్రమాదాన్ని గుర్తించి స్థానికులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులకు సైతం సమాచారం అందడంతో పూతలపట్టు, తవణంపల్లె, ఐరాల పోలీస్‌స్టేషన్ల పరిధిలోని పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్రామస్తులు అప్పటికే ప్రమాద ఘటనపై 108 వాహనానికి సమాచారం అందించడంతో 108 సిబ్బంది క్షతగాత్రులను చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రికి తరలించారు. రాత్రి కావడంతో మృతులను గుర్తించలేకపోతున్నారు. సమాచారం అందడంతో కలెక్టర్ హరినారాయణన్, ఎస్పీ రిశాంత్‌రెడ్డిలు హుటాహుటిన ఆసుపత్రికి వెళ్లి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలన్నారు.





# గేట్‌పుత్తూరుకు ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలి

### గాలి భానుప్రకాష్



రైల్వే అధికారులతో మాట్లాడుతున్న భానుప్రకాష్, మూసేసిన మార్గం

పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : పుత్తూరు పట్టణం నుంచి గేట్‌పుత్తూరుకు రాకపోకలు సాగించే స్థానిక ద్రౌపది దేవి గుడి వద్ద వున్న రైల్వే ట్రాక్ మార్గంలో ప్రజల సౌకర్యార్థం ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తెలుగుదేశం పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గాలి భానుప్రకాష్ రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేశారు. వేలాది మంది ప్రజలు రాకపోకలు సాగించే ఈ మార్గాన్ని మూసివేస్తూ బుధవారం అకస్మాత్తుగా రైల్వే అధికారులు ఇనుప కంచె నిర్మించారు. దీంతో గేట్‌పుత్తూరులో కలకలం రేగింది. దాంతో భానుప్రకాష్ గేట్‌పుత్తూరు ప్రజలతో కలిసి పుత్తూరు రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్, సీనియర్ ఇంజనీర్లను కలిసి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గేట్‌పుత్తూరులో నివశిస్తున్న సుమారు 25 వేల మంది ప్రజల్లో అత్యధికులు ప్రతిరోజు పుత్తూరు పట్టణంలోకి రాకపోకలు సాగించేందుకు ఈ మార్గాన్నే వినియోగిస్తారని తెలిపారు. దశాబ్ధాలుగా ప్రజలు వినియోగిస్తున్న ఈ మార్గాన్ని భద్రత పేరిట రైల్వే అధికారులు ఉన్న పళంగా మూసివేయడం సమంజసం కాదన్నారు. దీని వల్ల విద్యార్థులు, చిన్న వ్యాపారులు, ముఖ్యంగా మరమగ్గాల కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతారని తెలిపారు. గతంలో తన తండ్రి, మాజీ మంత్రి అయిన గాలి ముద్దుకృష్ణమనాయుడు పలుమార్లు రైల్వే అధికారులతో సంప్రదించి, తరచూ చెన్నై వెళ్లి రైల్వే ఉన్నతాధికారులకు విజ్ఞప్తులు చేయడమే కాకుండా ఇటు రాష్ట్ర ప్రభుత్వాన్ని కూడా ఒప్పించి పట్టణంలో కోట్లాది రూపాయల వ్యయంతో రైల్వే అండర్, ఓవర్ బ్రిడ్జి నిర్మించారని తెలిపారు. అసలు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయకుండా వున్న మార్గాన్ని ఎలా మూసివేస్తారని ప్రశ్నించారు. ప్రజల ఇబ్బందులు దృష్టిలో వుంచుకుని ఫుట్ ఓవర్ లేదా అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టిడిపి చిత్తూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపిపి గంజి మాధవయ్య, పట్టణాధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

**గేట్‌పుత్తూరుకు దారి సౌకర్యం కల్పించాలి : సిపిఎం**

పట్టణం నుంచి గేట్‌పుత్తూరుకు రాకపోకలు సాగించే మార్గాన్ని రైల్వే అధికారులు మూసివేయడం పట్ల సిపిఎం నాయకులు బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ కార్యదర్శి ఆర్.వెంకటేష్, దళిత, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి వై.నందయ్య మాట్లాడుతూ దశాబ్ధాలుగా వాడుకలో వున్న మార్గాన్ని హఠాత్తుగా మూసివేయడం వల్ల విద్యార్థులు, వృద్ధులు, గర్భిణీలు, విద్యార్థినీ, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని తెలిపారు. ప్రత్యామ్నాయ మార్గాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజా సంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ధర్నాలో నాయకులు సుబ్రమణ్యం, శేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# బిసిలకు చంద్రబాబు ఏం చేశాడో చెప్పాలి!

**డిప్యూటీ సిఎం నారాయణస్వామి**



తిరుపతి ప్రెస్‌క్లబ్, డిసెంబర్ 7 ప్రభాతవార్త: టిడిపి పార్టీకి వెన్నుముక బిసిలేనని, వారు లేకపోతే తమ పార్టీనే లేదని నిత్యం బీరాలు పలికే చంద్రబాబు నాయుడు అసలు 14 ఏళ్ల తన పాలనలో వారికంటూ ఏం చేశాడో చెప్పాలని రాష్ట్ర డిప్యూటీ సిఎం కె.నారాయణస్వామి సవాల్ విసిరారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ నిత్యం బిసిలు బిసిలు అని వారి నామస్మరణ చేసే చంద్రబాబు వారిలో ఒక్కరిని కూడా ఇంతవరకు రాజ్యసభకు పంపలేదని ఆరోపించారు. బిసిల ఓట్లు దండుకుని రాజ్యాధికారం చేపట్టాడే కానీ, వారి అభివృద్ధికి ఏనాడూ ఒక మంచి పని కూడా చేయలేదన్నారు. అలాగే ఎస్సీలు టిడిపికి ఓట్లేయరని భావించి, వారికి సైతం ఆయన పాలనలో ఏ ఒక్క మంచి పని కూడా చేయలేదన్నారు. ఏదైనా బిసిలకు, ఎస్సీలకు కొంత వరకు న్యాయం చేశారంటే అది స్వర్గీయ నందమూరి తారకరామారావు తప్ప చంద్రబాబు ఎంతమాత్రం కాదన్నారు. చంద్రబాబుది ఔరంగజేబు మనస్తత్వం కాబట్టే నమ్మిన మామను వెన్నుపోటు పొడవడమే కాకుండా ఆయన మరణానికి సైతం కారణమైన దుర్మార్గుడు అంటూ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ ఇచ్చిన వాగ్ధానాలన్నింటికీ తూట్లు పొడిచాడని, అందుకే ఆయన అమలు చేసిన రెండు రూపాయలకే కిలో బియ్యం పథకాన్ని 5 రూ॥లకు చేయడం, సంపూర్ణ మద్యపాన నిషేధం అమలు చేసినా, తిరిగి ఈయన సిఎం కాగానే మద్యాన్ని ఏరులై పారించాడని మండిపడ్డారు. అదే జగన్‌మోహన్‌రెడ్డి 45 నుండి 60 ఏళ్ల వరకు వయసున్న బిసి మహిళలకు 18 వేల 750 రూ॥లు ఇవ్వడం, డ్వాక్రా మహిళలకు రుణాన్ని తీర్చడంతో పాటు నవరత్నాల ద్వారా అనేక సంక్షేమ పథకాలు అందిస్తున్న గొప్ప చరిత్ర జగన్‌దన్నారు. బుధవారం విజయవాడలో జరిగిన బిసి గర్జన సభ చూస్తే జగన్ పాలన ఎంత గొప్పగా ఉందో అర్థమవుతందన్నారు. అందుకే జగన్ సభలకు లక్షలాది మంది ప్రజలు సంతోషంగా వస్తున్నారని తెలిపారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు ఎన్ని పార్టీలను కలుపుకుని పోటీ చేసినా అతన్ని ఏమీ చేయలేడని, గెలుపు తమదేనని ధీమా వ్యక్తంచేశారు.

# దేదీప్యమానం కార్తీకదీపోత్సవం



తిరుమల ఆలయంలో దీపాల మూకుళ్లతో ఆలయ అధికారులు, అర్చకులు

తిరుమల, డిసెంబర్ 7 ప్రభాతవార్తప్రతినిధి: కార్తీక పర్వ దీపోత్సవం సందర్భంగా మంగళవారం రాత్రి నేతిదీపాలు కాంతుల్లో వెంకన్న ఆలయం మరింత దేదీప్యమానంగా శోభను సంతరించుకుంది. కార్తీక దీపోత్సవం తిరుమలేశుని ఆలయంలోపల ఆనందనిలయంలో గర్భాలయంలో అఖండం, కులశేఖరపడి, రాములవారిమేడ, ద్వారపాలకులు, గరుడాళ్వారు నుంచి వెలుపల బేడి ఆంజనేయస్వామి ఆలయం చివరకు స్వామి పుష్కరిణి వరకు దీపాలను వెలిగించారు.

# మభ్యపెట్టేందుకే బిసి గర్జనసభ

**-బీసిలకు చేసిన మంచి చెప్పండి**

**-టిడిపి భారీ వినూత్న నిరసన**



తిరుపతి, డిసెంబర్ 7ప్రభాతవార్త: రాష్ట్రంలో బిసిలపై దాడులు జరుగుతుంటే పట్టించుకోకుండా భయభ్రాంతులకు గురిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రజలను మభ్యపెట్టడానికే బిసి గర్జనసభ నిర్వహించారని టిడిపి నాయకులు మండిపడ్డారు. కనీసం బిసిల పేరు చెప్పి సభ నిర్వహించే నైతిక విలువలు జగన్‌కు, వైసిపి నేతలకు లేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసిపి బిసి గర్జనసభను నిరసిస్తూ తిరుపతిలో బుధవారం ఉదయం టిడిపి నాయకులు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, సత్యవేడు ఇన్‌ఛార్జి హేమలత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి వి.పుష్పావతియాదవ్, తిరుపతి పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షుడు రుద్రకోటి సదాశివం తదితరులు బిసిల పై జరుగుతున్న దాడులు, బిసిల పేరుచెప్పి కార్పొరేషన్‌లు ఏర్పాటు, నిధులు లేక ఉత్తుత్తి ప్రకటనలు, రిజర్వేషన్ల అమలు ఎక్కడ చేశారో చెప్పాలని, బిసిల చులకనుగా చూస్తూ సభ పెట్టడంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అనంతరం బిసిలపై జరుగుతున్న దాడులు, బిసిలకు జరిగిన అన్యాయంపై జిల్లా జెసి బాలాజీకి వినతిపత్రం అందజేశారు. ఈ నిరసన కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులు మీడియా కోఆర్డినేటర్ బి.శ్రీధర్‌వర్మ, కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ, నాయకులు దశరధాచారి గురవారెడ్డి, బుల్లెట్‌రమణ, నగరపార్టీ అధ్యక్షుడు చిన్నబాబు, మహేష్‌యాదవ్, మునస్వామియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త



లక్షలాది మంది నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్న ముఖ్యమంత్రి జగనన్నకు ధన్యవాదాలు అనే విన్నూత్న కార్యక్రమాల్ని బుధవారం వైకాపా కార్యాలయంలో శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి నిర్వహించారు. ఏపిఎస్‌బిసిఎల్ సూపర్‌వైజర్లు, సేల్స్‌మాన్‌కు జీతాలు పెంచిన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి 'థ్యాంక్యూ సిఎం సారు'అనే నినాదాలతో శాసనసభ్యుడు నిర్వహించారు. జగనన్న చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు. ఈ కార్యక్రమాల్లో నియోజకవర్గంలో పని చేస్తున్న మద్యం షాపుల సిబ్బంది పాల్గొన్నారు.

## శివయ్యసేవలో పుంగనూరు కమిషనర్

శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త :



వాయులింగేశ్వరుడు స్వయంభువుగా వెలసిన శ్రీకాళహస్తీశ్వరుని సేవలో ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.లోకేశ్వరశర్మ కుటుంబసభ్యులతో విచ్చేసారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం చెప్పారు. ఆయనతోపాటు కాపు సంఘ నాయకులు మందల బాలాజి తదితరులు హాజరయ్యారు.

## అభివృద్ధి శూన్యం..ధరలు ధగ ధగ

శ్రీకాళహస్తిరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త



రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని, పెరుగుతున్న దరలతో సామాన్యుని పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి, క్లస్టర్ ఇన్‌చార్జి రెడ్డివారి గురువారెడ్డి ధ్వజమెత్తారు. రాష్ట్ర పార్టీ, నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి పిలుపు మేరకు 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' అనే విన్నూత్న కార్యక్రమాల్ని నిర్వహించారు. మండలంలోని సీతారాంపేట గ్రామంలో ఇంటింటికి వెళ్ళి ఫార్మెట్లో ఉన్నటువంటి నిరుద్యోగ సమస్యలపై నిత్యవసర సరకుల ధరల పెరుగుదలపై ఇసుక మాఫీయాపై అభివృద్ధి లేకపోవటం అంశాలపై వివరిస్తున్నారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ సీనియర్ నాయకులు శివశంకర్‌రెడ్డి,శివాజిరెడ్డి, మురుగన్, రాచేటి సుబ్రమణ్యం,నరసింహులు, శ్రీనివాస్, వెంకటయ్య,రమణయ్య,గోపాల్‌రెడ్డి, నిరంజన్ తదితర నాయకులుహాజరయ్యారు.

## కొణతనేరిని అభివృద్ధి చేసిన ఘనత ఒక్క తెదేపాదే

తొట్టంబేడు, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీ ఇదేం కర్మ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో బుధవారం కొణతనేరి పంచాయ తీలోని కొణతనేరి, గుర్రప్పనాయుడు కండ్రిగ, గుర్రప్పనాయుడు కండ్రిగ హరిజన వాడలో ఇదేం ఖర్మ కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల అధ్యక్షుడు గాలి మురళీనాయుడులు మాట్లాడుతూ తమ గ్రామ హరిజనవాడలోని ప్రజలు ఇంటి స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నటువంటి సమయంలోఅప్పటి దివంగత నేత మాజీ మంత్రి వర్యులు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి మరియు దివంగత పోతుగుంట గురవయ్యానాయుడులు సహాయసహకారాలుతో ఇంటి స్థలాలు ఇప్పించి గృహనిర్మాణ పథకంలో లేఅవుట్లు వేయించిన ఘనత తెదేపాదే అన్నారు. సిసిరోడ్లు, స్మశానికి దారి ఏర్పాటు చేసిన ఘనత మాజీ ఎంపిపి కోవిపోలమ్మ, మరియు జడ్పీటిసి గాలి అనసూయమ్మ నిధుల సహాయంతో అప్పటి మాజీ జడ్పీచైర్మన్ గీర్వాణిచంద్రప్రకాష్ సహకారంతో ఏర్పాటు చేయడం జరిగిందనానరు. అంతేకాకుండా కొణతనేరి మరియు గుర్రప్ప నాయుడుకండ్రిగకు తారు రోడ్డు మరియు సిసిరోడ్లు వేయించారని చెరువులను ఆధునికీకరించి తూములు, మరియు తెలుగుగంగ కాలువ ద్వారా రెండు చెరువులకు ఎగువమరియు దిగువ కొణతనేరి చెరువులకు నీరు సమృద్ధిగా అందించారన్నారు. రాబోవు ఎన్నికల్లో బొజ్జలవారసుడిగా అందరి సహకారంతో సుధీర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించుకుందామని రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు మాజీ పాలసరఫరా చైర్మెన్ మునిరాజనాయుడు, రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, గ్రామ కమిటీ అధ్యక్షులు మురళీనాయుడు, భాస్కర్, మునిరత్నంనాయుడు, వెంకటమునినాయుడు, కుప్పయ్య, పరందామయ్య, రంగమ్మ, రమణమ్మ, మస్తానమ్మ, పవన్, సురేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## డిఐజిని సత్కరించిన రజక అధ్యక్షులు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



పట్టణానికి విచ్చేసిన డిఐజి రవిప్రకాష్‌ను రజక కులవృత్తుల సమాఖ్య పట్టణ అధ్యక్షులు సంజాకులమురళీ దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలను అందించారు. ఈమధ్య కాలంలో రాష్ట్రంలో రజకులపై దాదులు అధికమవుతున్నాయని రజకులకు న్యాయం జరిగే విధంగా చర్యలు చేపట్టాలని డిఐజి రవిప్రకాష్‌ను కోరారు. రజక మహిళలకు రక్షణ కరువైందని మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలుతీసుకోవాలన్నారు.

## ప్రతి ఒక్క అధికారి అప్రమత్తంగా ఉండాలి : ఆర్డీవో

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7ప్రభాతవార్త :



బంగాళాఖాతంలోఏర్పడిన అప్పపీడనం తీవ్ర తుఫానుగా మారుతుండడంతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేకు అధికారులు అందరినీ అప్రమత్తం చేశామని శ్రీకాళహస్తి ఆర్డీవో కెఎస్.రామారావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఈఏడాది అందరి అధికారులను అప్రమత్తం చేయడం జరిగిందన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్‌రూంలను ఏర్పాటు చేయనున్నామన్నారు. భారీ వర్షాలు పడితే వారిని పునరావాసకేంద్రాలకు తరలించి భోజనం కూడా అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

## సిటీఛాంబర్ సేవలు గ్రామాలకు విస్తరించాలి

-రాష్ట్రపతి ద్రౌపదిముర్ము

తిరుపతి,డిసెంబర్ 7ప్రభాతవార్త:



సేవే లక్ష్యంగా....మానవత్వం మూర్తీ భవించిన దృక్పథంతో సమాజ సేవలందిస్తున్న తిరుపతి సిటీఛాంబర్ నిర్వాహకులు సేవలను గ్రామీణప్రాంతాలకు విస్తరించాలని భారత రాష్ట్రపతి ద్రౌపదిముర్ము సూచించారు. సిటీఛాంబర్ ఆధ్వర్యంలో సాదారణంగానేగాక గత రెండేళ్ళ కరోనా వైరస్ లాక్‌డౌన్ సమయంలో ఎందరో పేదలకు, మూగజీవాలకు ఆకలితీర్చేలా తమదైన రీతిలో ఆహారం, పశువులకు గడ్డి, దాణా అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్రపతి ద్రౌపదిముర్మును సిటీఛాంబర్ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, వ్యవస్థాపక కార్యదర్శి షణ్ముగం యాదవ్, ఉపాధ్యక్షులు కెఎస్ వాసు, డాక్టర్ పి.కరుణానిధి, ఆచార్య స్టాన్లీ జయకుమార్‌లు ముర్మును కలిశారు. తిరుపతిలోని అట్లాంటిస్ వరల్డ్ పాఠశాల విద్యార్థులు చిత్రీకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిత్రపటాన్ని ఆమెకు బహుకరించారు. తన చిత్రాన్ని గీచిన విద్యార్థులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. త్వరలోనే సిటీఛాంబర్ నిర్వాహకులను రాష్ట్రపతి భవన్‌కు ఆహ్వానిస్తామని తెలిపారు.

## రైల్వే ట్రాక్ వద్ద బారికేడ్లను తొలగించాలి : వైకాపా నాయకులు

పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త :




పట్టణంలో ద్రౌపదిదేవి గుడి వద్ద గేట్‌పుత్తూరు వాసులు పట్టణానికి రాకపోకలు సాగించే మార్గంలో రైల్వే అధికారులు వేసిన ఇనుప బారికేడ్లను వెంటనే తొలగించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం స్థానిక రైల్వే అధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి, వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ (చిట్టి), మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ వి.ఎం.మాహీన్ మాట్లాడుతూ గేట్‌పుత్తూరు ప్రజలకు ఇబ్బంది కలిగేలా రైల్వే అధికారులు బారికేడ్లు నిర్మించిన విషయం తెలిసిన వెంటనే రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఆదేశాల మేరకు తాము రైల్వే అధికారులను కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. మంత్రి రోజా కూడా చెన్నైలోని డివిజన్ రైల్వే మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడారని, అలాగే గురువారం ఉదయం అరక్కోణం నుంచి పుత్తూరు రైల్వే స్టేషన్‌కు రానున్న ఇంజనీరింగ్ అధికారులతో ఆమె స్వయంగా ఈ సమస్యపై చర్చిస్తారని తెలిపారు. రైల్వే అధికారులు స్థానికుల ఇబ్బందిని కూడా దృష్టిలో పెట్టుకోవాలని, ఏకపక్షంగా వ్యవహరించడం కరెక్ట్ కాదని అన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ కౌన్సిలర్లు తదితర నాయకులు పాల్గొన్నారు.

## భారత సైనికుల ధైర్య సాహసాలకు విలువ కట్టలేం: ఎంపిపి

రామచంద్రాపురం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



భారత సైనికుల ధైర్య సాహసాలకు విలువకట్టలేమని ఎంపిపి ఎ.వి.బ్రహ్మానందరెడ్డి అన్నారు. బుధవారం ఎంపిడిఓ కార్యాలయంలో ఏపిఎం రాధమ్మ ఆధ్వర్యంలో సైనికుల సహాయార్థం రూ.1,00196/-లు చెక్‌ను ఎంపిపి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం మహిళా సంఘాల సభ్యులు 8 వేల మంది వున్నారనీ, అందరూ కలసి అధిక మొత్తంలో విరాళంగా అందజేయడం అభినందనీ యమన్నారు. మహిళలు దేశ రక్షణలో తమవంతు సహాయ సహకారాలు అందించడం వారిలోని దేశభక్తికి నిదర్శనమన్నారు. ఈ కార్యక్రమంలోసింగిల్‌విండోఅధ్యక్షుడుచంద్రశేఖర్‌రెడ్డి, మహిళా సమైఖ్యా లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రం తిరోగమన దిశలో నడుస్తున్నది

-టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి

రామచంద్రాపురం, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



రాష్ట్ర అభివృద్ధి తిరోగమన దిశలో నడుస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు తిరుమల రెడ్డి దుయ్యబట్టారు. బుధవారం సొరకాయల పాళ్యంలో రాష్ట్రానికి ఇదేమి కర్మ అనే కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి సాంకేతికతను అందించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రహదారులకు గుంతలు పూడ్చిన పాపానాపోలేదంటూ దుయ్యబట్టారు. రాష్ట్రం సమగ్రాభివృద్ధి సాధించాలంటే మరొక అవకాశం చంద్రబాబుకు అప్పగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి జనార్దన్ చౌదరి, ఉమాపతి నాయుడు, రావిళ్ళ గిరి, మాదవయ్య జెడి జగన్, సురేంద్ర నాయుడు, సుబ్రమణ్యం యాదవ్, భాస్కర్ యాదవ్, ఢిల్లీనాథ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం : తహశీల్దార్

చంద్రగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



ఓటర్ కార్డుతో ఆధార్ కార్డు అనుసంధానం చేసుకునేవిధంగా ఓటర్లను చైతన్యపరచాలని తహశీల్దార్ శిరీషా అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో బుధవారం బూత్‌లెవెల్ ఆఫీసర్లతో స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మీ పరిధిలోని పోలింగ్ స్టేషన్‌లలోని ఓటర్ లిస్ట్‌ను ప్యూరిఫై చేయాలన్నారు. ఈ సమావేశంలో సూపర్‌వైజర్లు స్వర్ణలత, అమృత, మోహన్ రెడ్డి, ఉషారాణి, వినోద్, పాల్గొన్నారు.

## ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు : ఎంపిపి

చంద్రగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



పంచాయతీ సమగ్రాభివృద్ధిలో ప్రణాళికాబద్ధంగా నిర్ణయాలు తీసుకుని ప్రాధాన్యతాక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని ఎంపిపి మావిళిరెడ్డిగారి హేమేంద్రకుమార్ రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గ్రామాభివృద్ధి ప్రణాళికపై శిక్షణా తరగతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన నిధులను గుర్తించాలన్నారు. ఆపై పంచాయతీలో అవసమైన పనులను గుర్తించి తీర్మాణం చేసుకోవాలన్నారు. అయితే మెజారిటీ ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులను ప్రాధాన్యతగా తీసుకుని పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ శిరీషా, ఈఓపిఆర్‌డి శశిరేఖ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## వర్షం సహాయ చర్యలకు హెల్ప్ లైన్ ఏర్పాటు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



తిరుపతి మున్సిపల్ పరిధిలోని ప్రజలు రానున్న వర్షాల వలన ఎలాంటి ఇబ్బందులు వున్నా వెంటనే తమ హెల్ప్ లైన్ నంబర్ 0877 - 2256766 కు ఫోన్ చేయాలని తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. బుధవారం తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డితో జరిగిన విసి సమావేశంలో పాల్గొన్న అనంతరం మున్సిపల్ అధికారులతో ప్రత్యేకసమావేశం నిర్వహించారు. కాలువలు ఏవైన మరమ్మత్తులు చేయాలంటే వెంటనే చేయాలని సూపరింటెండెంట్ ఇంజనీర్ తిరుమాలిక మోహన్‌కు శానిటేషన్, వైద్యం అందుబాటులో వుండేలా జాగ్రత్తలు తీసుకోవాలని హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికృష్ణకు, హెల్ప్ లైన్ వద్ద నిరంతరం విదుల్లో వుండేలా సిబ్బందిని ఏర్పాటు చేయాలని మేనేజర్ చిట్టిబాబుకు కమిషనర్ అనుపమ అంజలి ప్రత్యేక ఆదేశాలు జారీ చేసారు.

## జయహో బీసీ మహాసభ కార్యక్రమంలో పాల్గొన్న మేయర్

తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త :

బీసీ మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష శ్రీవెంకటేశ్వర స్వామి బొమ్మను బహుకరించారు. బుధవారం విజయవాడలో ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహించిన బీసీ మహాసభకు తిరుపతి నగర పాలక సంస్థ మేయర్ డా. శిరీష పాల్గొన్నారు. మేయర్ డా. శిరీష మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తిరుపతి గుర్తింపు వుందని అందుటో బీసీ మహిళగా మేయర్ పెదవిని తనికి ఇచ్చినందుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి, తిరుపతి శాసన సభ్యులు భూమన కరుణాకర్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.

## వైద్య శిబిరానికి స్పందన

తిరుపతి నగరం, డిసెంబరు 7 ప్రభాతవార్త :



స్థానిక ఎమ్మార్‌పల్లి- మారుతీ నగరంలో బనాల ఫార్మసి అండ్ క్లినిక్‌లో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించినట్లు ఫార్మసి క్లినిక్ అధినేత రవీంద్రారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వంద మంది రోగులకు బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## పాముకాటుకు కౌలు రైతు మృతి!

శ్రీకాళహస్తిరూరల్,డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు దళితవాడకు చెందిన మాదాసుసుధాకర్ పాము కాటుకు గురై మృతి చెందినట్లు సమాచారం అందించారు. బుధవారం కుటుంబసభ్యులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. దళితవాడకు చెందిన మాదాసు సుధాకర్(53), పలువురు రైతుల భూములను కౌలుకు తీసుకొని పంటలు పండించుకునే వాడని వివరించారు. మంగళవారం రాత్రి పొలానికి నీరుకట్టడానికి వెళ్ళి వచ్చిన ఆతను ఇంట్లో భోజనం చేసిన తరువాత కొంత సేపటికి నోటి నుంచి నురగా వస్తుండగా పరిశీలించిన కుటుంబసభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలిస్తుండగా చెర్లొపల్లి వద్ద ఆతను మృతి చెందినట్లు తెలిపారు.ఎంపిపి సంపూర్ణచెంగల్ రాయలు మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబసభ్యులతో సానుభూతి తెలిపారు. సుధాకర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## కౌలురైతు కుటుంబానికి బొల్లి ఆర్థిక సహాయం

శ్రీకాళహస్తి రూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం తొండమనాడు దళితవాడకు చెందిన కౌలు రైతు సుధాకర్(53)పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటన తెలిసిందే.అయితే ఆ కుటుంబాన్ని మండల నాయకుడు బొల్లినేని జగన్నాధం నాయుడు ఆర్థిక సహాయం అందించి ఆదుకున్నారు. ఆయన కుటుంబాన్ని పరామర్శించారు.జేకే కన్‌స్ట్రక్షన్స్ యజమాని రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాధం నాయుడు ఆ కుటుం బానికి రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందించారు.

## గంగమ్మ ఆలయంలో మహా చండీహోమం

తిరుపతి,డిసెంబర్ 7 ప్రభాతవార్త:



పవిత్రమైన కార్తీకమాసం పౌర్ణమి ఘడియలు, దత్తాత్రేయ జయంతి పురస్కరించుకుని ఆధ్యాత్మిక నగరం తిరుపతి తాతయ్యగుంటగంగమ్మ ఆలయంలో బుధవారం ఉదయం పౌర్ణమిసందర్భంగా మహాచండీహోమం నిర్వహించారు. ఈ హోమ కార్యక్రమంలో తిరుపతి నగరపాలకసంస్థ ఉపమేయర్ భూమన అభినయ్‌రెడ్డి, తుడ కార్యదర్శి లక్ష్మి, గంగమ్మ ఆలయ ఛైర్మన్ కట్టాగోపీయాదవ్, ఆలయ ఇఓ ఎం.మునికృష్ణయ్య, ధర్మకర్తలు ధనశేఖర్, క్రిష్ణమ్మ ,భారతి, వెంకటేశ్వరరావు, హరినాధరెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## శివయ్య సన్నిధిలో జిల్లా పంచాయతీ అధికారి

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



తిరుపతి జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయపు పరిపాలనాధికారి ప్రభురెడ్డి మరియు శ్రీపతి, కృష్ణమూర్తి, గిరిధర్‌రెడ్డిలు కుటుంబసభ్యులతో శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా వీరికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులుకందుకూరిఆనందబాబు,హంసప్రకాష్‌లుఆలయ దక్షిణగోపురంవద్ద స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేపట్టారు. అనంతరం వీరికి దక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలను, శేషవస్త్రాలను అందించి సత్కరించారు.ఆలయాధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించండి : డిఈవో

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని డిఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. బుధవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించారు. ప్రభుత్వం కొత్తగా రూపొందించిన మెను ప్రకారం భోజనాన్ని అందించాలన్నారు. ఆయనతోపాటు ఎంఈవో భువనేశ్వరి, హెచ్ఎం చంద్రబాబు, ఎంఈవో కార్యాలయ సిబ్బంది ప్రశాంత్, ఐఈఆర్‌టిలు జనార్దన్, మజ్ను తదితరులు పాల్గొన్నారు.

## డిఐజికి ఘనస్వాగతం

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



అనంతపురం రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్(డిఐజి) ఎం.రవిప్రకాష్ బుధవారం శ్రీకాళహస్తి డిఎస్పీ కార్యాలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు స్థానిక డివైఎస్పి ధర్మవరపు విశ్వనాథ్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో డిసిఆర్‌బి సిఐ చంద్రశేఖర్‌పిళ్ళై, సిఐలు కృష్ణమోహన్, విక్రమ్, భాస్కర్‌నాయక్, ఎస్ఐలు తిమ్మయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, రాఘవేంద్ర, మంజునాథ్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ వెంకటప్ప, ఎస్ఐ విజయకుమార్‌నాయక్, ఎఎస్ఐ రియాజ్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ఘనంగా దత్తజయంతి వేడుకలు

శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త :



శ్రీకాళహస్తి-చెన్నై రోడ్డులో వెలసిన షిరిడి సాయిబాబా ఆలయంలో వెలసిన దత్త జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దత్తాత్రేయ జయంతి సందర్భంగా స్వామివారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం దత్తపారాయణం చేపట్టారు. పలువురు భక్తులు విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

## అయ్యో వరినారు నాశనం చేశారు... రైతు ఆవేదన

రేణిగుంట, డిసెంబరు 7 ప్రభాతవార్త:



అయ్యో దేవుడా... ఎంత ఘోరం చేశారు, ఆరు ఎకరాలకు సరిపడే వరినాటిన పొలంలో నారు చనిపోయే కలుపు మందు పిచికారి చేసి గుండె కోత మిగిల్చారు అంటూ రైతు సుబ్బరామ నాయుడు కన్నీటి పర్యంతమయ్యారు. రేణిగుంట ఐటీ హబ్ సమీపంలోని జింకల మిట్ట వద్ద ఉన్న పొలంలో ఆరు ఎకరాలకు సరిపడే వరినారును నాటినట్లు సుబ్బరామనాయుడు తెలిపారు. మంగళవారం నారు పెరికించడానికి మనుషులను తీసుకుని వెళ్లి చూసేసరికి నారుపై కొంత మంది అది చనిపోవడానికి కావాలని కలుపు మందు చల్లినట్టు గుర్తించామని తెలిపారు. నారు ఎందుకు పనికిరాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు దాదాపు రెండు లక్షల రూపాయల నష్టం వాటిల్లిందన్నారు. నారు నాశనం చేసిన వారిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు.

## ముఖ్యమంత్రిని కలవడం మహదానందం

రేణిగుంట, డిసెంబరు 7 ప్రభాతవార్త:



రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని ప్రత్యక్షంగా కలసి పూల బొకేలు ఇవ్వడం ఆనందంగా ఉందని వైకాపా సీనియర్ నేత తూకివాకం మాజీ ఎంపీటీసీ సుబ్రహ్మణ్యంరెడ్డి, తూకివాకం ఉపసర్పంచ్ శ్రీనివాసులు, ఎంపీటీసీ ఆనందరావు తెలిపారు. రేణిగుంట విమానాశ్రయంలో బుధవారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చొరవతో ముఖ్యమంత్రిని కలవకలిగామని తెలిపారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## క్రికెట్ టోర్నమెంట్‌లో కలికిరి సీకాం డిగ్రీ కళాశాల క్రీడాకారులు గెలుపు

తిరుపతి (క్రీడా), డిసెంబర్ 7, ప్రభాతవార్త



ఎస్వీ యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ మెన్ క్రికెట్ టోర్నమెంట్ ఆర్గనైజ్డ్ డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎస్వీ ఆర్ట్స్ కాలేజ్, టిటిడి తిరుపతి ఆర్గనైజింగ్ సెక్రటరీ, ఫిజికల్ డైరెక్టర్ తెలియజేస్తూ 28 జట్లు పాల్గొన్న ఈ టోర్నమెంట్‌లో ఫైనల్స్‌కు సీకాం కలికిరి జట్టు, సికాం తిరుపతి జట్టు చేరుకున్నాయని తెలిపారు. బుధవారం జరిగినటువంటి ఫైనల్స్ మ్యాచ్‌లో సీకాం డిగ్రీ కాలేజ్ తిరుపతి జట్టు 152 పరుగులు చేసి నాలుగు వికెట్లు ఉండగానే గెలుపొందింది. మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌గా సయ్యద్ హాకీబ్‌కి ప్రకటించారు. గెలుపొందిన జట్టుకు ముఖ్య అతిధిగా విష్ చేసినటువంటి ఎస్వీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ప్రొఫెసర్ కె. రాజారెడ్డి, ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డా. టి. నారాయణమ్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, ఫిజికల్ డైరెక్టర్ అహ్మద్, ప్రొఫెసర్ ఎం. శివశంకర్ రెడ్డి, డైరెక్టర్ ఎస్వీ యూనివర్సిటీ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందజేసారు.

## శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో అవగాహన కార్యక్రమం

తిరుపతి (విద్య), డిసెంబర్ 7, ప్రభాతవార్త :



శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాల యంలోని మహిళా అధ్యయన కేంద్రం వారు ఇంటర్నేషనల్ డే ఆఫ్ పర్సన్స్ విత్ డిజేబులిటి డేని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. శివజ్యోతి నగర్‌లోని అందుల శరణాలయంలో విద్యార్థులకు, భవాని నగర్‌లోని యూత్ ఫోర్ జాబ్ ఫౌండే షన్ ట్రైనింగ్‌లో విద్యార్థులను ఉద్దేశించి శ్రీ పద్మావతి మహిళా అధ్యయన కేంద్ర లెక్చరర్‌కె.రాణి 2022 ఓల్డ్ డిజేబుల్ డే థీమ్ అయినటువంటి సమ్మిళిత అభివృద్ధి కోసం పరివర్తన పరిష్కారాలు, ప్రాధాన్యత, సమానమైన ప్రపంచానికి ఆజ్యం పోయడంలో ఆవిష్కరణల పాత్ర అనే అంశం పై వివరించారు. ఈ కార్యక్రమంలో జాబ్ ఫోర్ యూత్ సిబ్బంది విజయ్ కుమార్, సలీం, సికిందర్, విశ్వనాథ్, మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది డా. ఎం. ఇంద్రాణి పాల్గొని సహాయ సహకారాలు అందించారు.

## వైయస్ఆర్ కాంగ్రెసు ప్రభుత్వంలో పేదలకు అన్యాయం

-నగరి నియోజకవర్గం ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్

నింద్ర,డిసెంబర్ 7 ప్రభాతవార్త :



వైయస్ఆర్ కాంగ్రెసు ప్రభుత్వంలో పేద ప్రజలకు తీరని అన్యాయం జరుగుతున్నదని నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గాలిభానుప్రకాష్ తీవ్రంగా విమర్శించినారు. బుధవారం మండలంలోని నెట్టేరి గ్రామపంచాయితీలో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో ఇదేమి ఖర్మరా అనే కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ అధికారంలో వచ్చిన తరువాత రాష్ట్రంలో పేద ప్రజలపై నిత్యవసరాల వస్తువుల ధరలు విపరీతంగా పెంచడం,చెత్తపై పన్నులు వేయడం వలన ధరలు ఆకాశాన్ని అంటుతున్నదని అన్నారు.వైయస్ఆర్ కాంగ్రెసు పార్టీ నాయకులు చెరువులోని మట్టి,పక్కన వున్న కొండలుగుట్టలు కొల్లగొట్టేస్తున్నారని విమర్శించినారు. ఈకార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు వెంకటేశ్వరరావు,చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు ధశరథ వాసు,చిత్తూరు పార్లమెంటరీ రైతు కమిటి ఉపాధ్యక్షులు బాబుయాదవ్,నాయకులు కిష్టయ్య, వెంకటరత్నంనాయుడు, జగన్,పరదేశి,భాస్కర్, ఆనందరాజు,రవినాయుడు,గంగధరంనాయుడు,తదితరులు పాల్గొన్నారు.

## ఫోర్టిఫైడ్ రైస్ పారపోయవద్దు : ఎంఈఓ

చంద్రగిరి, డిసెంబర్ 7 ప్రభాతవార్త:



ఫోర్టిఫైడ్ రైస్‌ను పారపోయవద్దని ఎంఈఓ శ్రీవరం లలితకుమారి మధ్యాహ్న భోజన పథకం వంటవారికి సూచించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో కిలో సాధారణ బియ్యంలో 10 గ్రాములు ఫోర్టిఫైడ్ బియ్యం కలుపుతారని అన్నారు. అయితే సాధారణ బియ్యం నీటిలో మునిగి వుంటాయనీ ఫోర్టిఫైడ్ బియ్యం మాత్రం నీటిపై తేలియాడుతూ వుంటాయన్నారు. పోషక విలువలను పెంచేందుకై కృత్రిమంగా విటమిన్లు, సప్లిమెంట్లు కలిసిన బియ్యమే ఫోర్టిఫైడ్ బియ్యం అన్నారు. విద్యార్థులలో పోషకాహారలోపాన్ని నియంత్రించేందుకై బియ్యం, ఇతర ధాన్యాలలో ఫోర్టిఫైడ్ రైస్ కెన్నెల్స్ కలిపి సరఫరా చేస్తున్నారని అన్నారు. వంట సమయంలో తేలియాడే బియ్యం నాశిరకంగానో, మరో విధంగా భావించి తీసిపడవేయద్దన్నారు.

# సబ్‌డివిజన్‌లో కేసుల పురోగతిపై డిఐజి అసంతృప్తి

-ఫిర్యాదుదారులతో మర్యాదగా నడుచుకోవాలి



శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి సబ్‌డివిజన్‌లో కేసుల పురోగతిపై అనంతపురం రేంజి డిఐజి ఎం.రవిప్రకాష్ అసంతృప్తి వ్యక్తం చేశారు. బుధవారం శ్రీకాళహస్తి డివైఎస్‌పి కార్యాల యానికి విచ్చేసిన ఆయనకు డివైఎస్‌పి ధర్మవరపువిశ్వనాథం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన డిఎస్పీ కార్యాలయాన్ని తనిఖీచేసి కేసుల పురోగతిని తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న కేసుల వివరాలు, చోరీలు, హత్యలు, చిన్నారులపై అత్యాచారాలు, ఎస్‌సి,ఎస్‌టి కేసులు, పోక్సో కేసులు కూడా నమోదయినట్లు తెలిపారు. శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో ఫోక్సో కేసులు ఎక్కువగా నమోదవుతున్నట్లు తన దృష్టికి వచ్చిందని పలు పిర్యాదులు కూడా అందుతున్నాయన్నారు. చిన్నారులకు, బాలికలకు అవగాహన కల్పించడం కోసం పాఠశాలలో, వసతిగృహాలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని డిఎస్‌పిని ఆదేశించారు. పుణ్యక్షేత్రంలో హత్యలు చేసే పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయని వివరించారు. పోలీస్‌స్టేషన్‌కు ఎంతోమంది నిరుపేదలు న్యాయం కోసం వస్తుంటారని వారితో సిబ్బంది మర్యాద పూర్వకంగా మాట్లాడాలని పిర్యాదుదారులతో అసభ్యంగా ప్రవర్తించినా, వారిని ఇబ్బంది పెట్టినా సిబ్బందిపై కఠిన చర్యలుతీసుకుంటామని హెచ్చరించారు. సమస్యలను ఎస్‌పి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించాలని ఆదేశించామన్నారు. కేసుల పురోగతిలో శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ గత ఏడాది 42శాతం ఉంటే ఈఏడాది 38శాతానికి పడిపోయిందని కనీసం 90శాతం వరకు కేసుల రికవరీ పురోగతి ఉండాలన్నారు. పుణ్యక్షేత్రమైన శ్రీకాళహస్తి పట్టణంలో ఎక్కువమంది భక్తులు వస్తుంటారని చైన్‌స్నాచర్లు, గుర్తు తెలియని వ్యక్తులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కొత్తగా సాఫ్ట్‌వేర్‌తో లాప్‌టాప్ తీసుకెళ్ళి పుణ్యక్షేత్రాల వద్ద, పట్టణాల్లో ఉన్న గుర్తుతెలియని వ్యక్తుల సంచరిస్తుంటే వారి వేలిముద్రలు పరిశీలిస్తే వారి నేరచరిత్ర తెలుసుకోవచ్చన్నారు. దీంతో ప్రజలకు రక్షణ కల్పించవచ్చన్నారు. గంజాయి, గుట్కా అక్రమరవాణాలు ఉత్తరాంధ్రనుంచి వస్తున్నా యని వీటిని అరికట్టేందుకు ప్రత్యేక చర్యలుతీసుకుంటున్నామన్నారు. గూడూరు సబ్‌డివిజన్ నుంచి తడ వరకు వెళ్తుంటాయని తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు సంబందించి ప్రత్యేకంగా యువకుడు చక్రవర్తిని నియమించామన్నారు. ఎర్రచందనం అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. పుణ్యక్షేత్రాల్లో సిసి కెమెరాలు ఏర్పాటుకు అన్ని చర్యలుతీసుకుంటున్నామన్నారు. క్రైం రేటును తగ్గించేందుకు ప్రతినెలా సమావేశాన్ని నెలా సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు. పేకాట, మట్కాలపై దృష్టి సారించాలని డిఎస్‌పి, పోలీసులను ఆదేశించామన్నారు. అనంతరం పోలీసులు గౌరవందనం స్వీకరించారు. సమావేశంలో డిఎస్‌పి విశ్వనాథం, డిసిఆర్‌బి సిఐ చంద్రశేఖర్‌పిళ్ళై, సిఐలు కృష్ణమోహన్, విక్రమ్, భాస్కర్‌నాయక్, ఎస్‌ఐలు తిమ్మయ్య, వెంకటేశ్వర్లు, మహేష్, రాఘవేంద్ర, మంజునాథ్‌రెడ్డి, ట్రాఫిక్ సిఐ వెంకటప్ప, ఎస్ఐ విజయకుమార్‌నాయక్, ఎఎస్ఐ రియాజ్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రణాళికా బద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాలు సాధ్యం

- కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ బిసి నాగరాజ్




కుప్పంరూరల్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివితే ఉన్నత లక్ష్యాలు సులువుగా అధిరోహించవచ్చని కుప్పం ఇంజనీరింగ్ కాలేజ్ చైర్మన్ బిసి నాగరాజ్ పేర్కొన్నారు. కెఇసిలో బిటెక్ ఫస్టియర్ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమంను ఘనంగా నిర్వహించారు. ఈసందర ్భంగా ఆయన మాట్లాడుతూ బిటెక్‌తో పాటు ఇతర సర్టిఫికెట్ కోర్సులు చేయడంతో సులువుగా ఉద్యోగులు సాధించవచ్చన్నారు. ప్రిన్సిపాల్ డా॥ సుధాకర్‌బాబు మాట్లాడుతూ బిటెక్ కోర్సులపై అవగాహన కల్పించారు. విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్ పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో హిందాల్లో ఇండస్ట్రీ హెడ్ రవీంద్రబాబు, వైస్ ప్రిన్సిపాల్ డా॥ భాస్కరన్, ఆర్‌అండ్‌డి డా॥ కోదండరామయ్య, మాధవన్, హెచ్‌ఒడిలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



పుత్తూరు, డిసెంబరు 7 ప్రభాతవార్త : స్థానిక ఎస్‌ఆర్ఎస్ ప్రభుత్వోన్నత పాఠశాల క్రీడా మైదానంలో బుధవారం అండర్ 17 బాల బాలికల ఫుట్ బాల్, అండర్ 14, 17 బాలిబాలికల తైక్వాండో జిల్లా స్థాయి పోటీలు జరగ్గా, ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకూ కడప జిల్లా ఎర్రగుంట్లలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు క్రీడా జట్లు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా మునిసిపల్ ఛైర్మన్ ఎ.హరి మాట్లాడు తూ క్రీడాకారులు అత్యుత్తమ నైపుణ్యం ప్రదర్శించి రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా రాణిం చాలని ఆకాంక్షించారు. మునిసిపల్ వైస్‌ఛైర్మన్ డి.జయప్రకాష్ (చిట్టి) మాట్లాడుతూ మరిన్ని క్రీడల శిక్షణ కోసం క్రీడా సముదాయాలు, క్రీడా పరికరాలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తన వంతు ప్రయత్నం చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ బి.తిరుమలరాజు, ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆంజనే యులు శెట్టి, జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్ డి.గోపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పొదుపు నిధులపై ఆంక్షలు పెడితే ఎలా!

- ఎన్నికల హామీలు గుర్తు చేస్తే వేధింపులా!- కలెక్టరేట్ ఎదుట ఎస్టీయు ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా




చిత్తూరు, డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఉద్యోగులు, ఉపాధ్యాయులు తమ జీతాల నుండి పొదుపు చేసుకొన్న పిఎఫ్, ఎపిజిఎల్ఐ ఖాతాల్లోని సొమ్ములు చెల్లించడంపై ఆంక్షలు పెడితే ఎలాగని జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు పెద్దిరెడ్డి దేవరాజులురెడ్డి ప్రశ్నించారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం ఎస్టీయు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా ఎస్టీయు అధ్యక్షుడు పెద్దిరెడ్డి దేవరాజులురెడ్డి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ప్రస్తుతం గుర్తు చేస్తుంటే ఉపాధ్యాయులపై వేధింపులకు పాల్పడటం పద్ధతి కాదని పేర్కొన్నారు. బెదిరింపులు, ఒత్తిడులు, కేసులకు ఉపాధ్యాయ సంఘాల నేతల భయపడే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్ర ఎస్టీయు అదనపు కార్యదర్శి పురుషోత్తం మాట్లాడుతూ సిపిఎస్ రద్దుపై ఇచ్చిన హామీని అమలు చేసి సిఎం మాట తప్పని మడమ తిప్పని నేతగా నిలవాలన్నారు. ఎన్నికల్లో హామీలు ఇవ్వకపోయినా పలు రాష్ట్రాలు సిపిఎస్‌ను రద్దు చేసిన విషయం ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ఎస్టీయు ఉపాధ్యక్షుడు లోకనాథరెడ్డి మాట్లాడుతూ విద్యా సంవత్సరం చివరి రోజుల్లో సద్దుబాటు పేరిట టీచర్లు, విద్యార్థులను ఇబ్బందికి గురి చేయడం పద్ధతి కాదన్నారు. రాష్ట్ర కార్యదర్శి హేమచంద్రారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనులు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎంఇఒలు, డివైఇఒలు, జూనియర్ లెక్చరర్ పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయడానికి సత్వరం చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ మాట్లాడుతూ ఉద్యమాల సందర్భంగా సంఘ నాయకులు, కార్యకర్తలపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమ ంలో జిల్లా ఎస్టీయు ఆర్థిక కార్యదర్శి మదన్‌మోహన్‌రెడ్డి, ఎస్టీయు నాయకులు కడియాల మురళి, మునెప్ప మొదలి, ఇలియాజ్‌భాషా, రవి, ఆయూబ్‌ఖాన్, మధు, లక్ష్మీపతి, కోటి, కమలాపతి, వాసు, గుణశేఖర్, సుబ్రమణ్యం పిళ్ళై, నాగేంద్రరాజు, శంకర్, శ్రీనివాసులు, మురళి, శ్రీరాములురెడ్డి, రమేష్, ఢిల్లీబాబు తదితరులు పాల్గొన్నారు.

## భారత్ బయోటెక్ ద్వారా 17 రకాల వ్యాక్సిన్లు



వెంకటగిరి, డిసెంబరు 7 ప్రభాతవార్త: భారత్ బయోటెక్ ద్వారా 17 రకాల వ్యాఖ్యలను తయారు చేసినట్లు ఆ సంస్థ కోఫౌండర్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సుచిత్ర ఎల్ల తెలిపారు. వెంకటగిరి వాసి మస్తాన్ యాదవ్ ఏర్పాటు చేసిన మన మస్తాన్ యాదవ్ ట్రస్ట్‌ను ఆమె ప్రారంభించారు. భారత్ బయో టెక్ ద్వారా భారతదేశంలో అత్యధికంగా జనా భా ఉన్నారని అందరికి సరిపడా వ్యాఖ్యలను కరోనా సమయంలో తయారు చేయగలిగినట్లు చెప్పారు. ఇతర దేశాలకు కూడా వ్యాక్సిన్లు పంపినట్లు వివరించారు. ప్రజల ఆరోగ్యమే ధ్యేయంగా చెప్పారు. భారత్ బయోటెక్ సేవా దృక్పథంతో పని చేస్తున్నట్లు తెలిపారు. మస్తాన్ యాదవ్ సేవ చేయాలని ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందించ దగ్గ విషయం అన్నారు. కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మీ మాట్లాడుతూ మస్తాన్ యాదవ్ పుట్టిన ఊరికి సేవ చేయాలని ట్రస్టు ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు. ఆయన చేసిన సేవలు వెంకటగిరి ఎంతగానో ఉపయోగపడుతున్నట్లు చెప్పారు. మస్తాన్ లాంటి వారు ఎంతో మంది ముందుకొచ్చి సేవ చేయాలని సూచించారు. భారత్ బయోటెక్ కరోనా సమయంలో వ్యాక్సిన్ను దేశానికి త్వరితగతిన అందించినట్లు వివరించారు. టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మాట్లాడుతూ భారత్ బయోటెక్ ప్రపంచ దేశాలకు ఉపయోగపడే విధంగా వ్యాక్సిన్ తయారు చేసినట్లు వివరించారు. మస్తాన్ యాదవ్ తాను తాను పుట్టిన ఊరికి సేవ చేయాలని అభినందించదగ్గ విషయమన్నారు. ఇంకా ఆయన సేవలను విస్తరింపజేయాలని సూచించారు. టిడిపి జాతీయ కార్యదర్శి బీద రవిచంద్ర మాట్లాడుతూ మస్తాన్ యాదవ్ వెంకటగిరిలో పుట్టి హైదరాబాదులో స్థిరపడినా సొంత గడ్డకు సేవ చేయాలనే తపనతో ఉన్నట్లు చెప్పారు. ఆయన సేవలను అభినందించాలని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావులు పాల్గొన్నారు.

## మండల అభివృద్ధి కోసం భారీగా నిధులు

- పెద్ద చెరువు ఆక్రమణల తొలగింపుకు చర్యలు- పాలసముద్రం మండల మీట్‌లో సభ్యులు



పాలసముద్రం, డిసెంబర్ 7 ప్రభాతవార్త: పాలసముద్ర మండల అభివృద్ధి కోసం భారీ నిధులు వెచ్చించి ఖర్చు చేసి మండలంలో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దడానికి చర్యలు తీసుకొంటామని ఎంపిపి ఎంపిపి శ్యామల, జడ్పీటిసీ అన్బుగలన్‌లు పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిపి శ్యామల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జడ్పీటిసీ మాట్లాడుతూ మండలంలో అభివృద్ధి పనులు చేపట్టడానికి 20 లక్షల రూపాయల జడ్పీ నిధులు మంజూరు అయ్యాయన్నారు. అలాగే ఐదు పంచాయతీల్లో పైపులైన్ల ఏర్పాటుకు ఒకొక్క పంచాయతీకి ఒకొక్క లక్ష మేరకు 5 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పంచాయతీలకు మంజూరు చేసిన సిమెంటు రోడ్ల పనులను సర్పంచ్‌లు ఇప్పటికీ ప్రారంభించలేదని సత్వరం ప్రారంభించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మందాపురం చెరువు కట్ట తెగిపోవడంతో నీళ్ళు తమిళనాడు రాష్ట్రంకు వెళ్తుందని ఇరిగేషన్ శాఖ అధికారులు ఇక్కడ చెక్‌డ్యామ్ కడితే మండలంలో మంచినీటి సమస్య తీరుతుందని సభ్యులు పేర్కొన్నారు. అలాగే పెద్ద చెరువు ఆక్రమణలకు గురైందని అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే వెంగళాపురం బీసీ బాలుర వసతి గృహం కూలిపోయే దశకు చేరిందని నాడు-నేడు పనుల్లో ఈ వసతి గృహ నిర్మాణం చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. తహసిల్దారు బాబు మాట్లాడుతూ మండలంలోని పలు గ్రామాలకు శ్మాసన వాటికలు లేవని అర్జీలు అందాయని, త్వరలో సర్వే నిర్వహించి స్మశాన వాటికలకు స్థలం మంజూరుకు చర్యలు తీసుకొంటామన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ విద్యావతి, ఎంఇఒ రాజేంద్రప్రసాద్, ట్రాన్స్‌కో ఎఇ వరదరాజులు, పిహెచ్‌సి డాక్టర్ మురళీకృష్ణ, ఎంపిటిసీ సభ్యులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా చంద్రగిరి జాతర వేడుకలు



చంద్రగిరి, డిశంబర్ 7 ప్రభాతవార్త: పోటెత్తిన జనసందోహం తరలిరాగా స్వర్ణముఖీనది నుండి అమ్మవారి ప్రతిమలను మోసుకువచ్చిన చాకలుల రాకతో బుధవారం చంద్రగిరిలో జాతర వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మేళతాళాలు, బ్యాండుబాజాలు, భాణాసంచా పేళుళ్ళ నడుమ నాలుగు బలుల వద్దకు చేరుకున్న అమ్మవారికి ఆయా ప్రాంతాల మహిళలు కుంబాలు సమర్పించారు. సంప్రదాయనుసారం అమ్మావారికి జంతుబలి గావించి, విశేష అలంకరణలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ముద్దికుప్పం రూపరామమూర్తి, పినపెద్దలు పాకాల సతీష్‌కుమార్‌రెడ్డి, విరూపాక్షి శంకర్ రెడ్డి, మొక్కల రాజారెడ్డి, నామాల శ్రీనివాసులు, ఎంపిటిసిలు బుల్లెట్ చంద్రమౌళి రెడ్డి, రాజులగారి సుజాత, మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ బండారు హేమచంద్రారెడ్డి, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏసు పంచిన ప్రేమను పది మందికి పంచడమే క్రిస్మస్! : ఏపి బిషప్స్ కౌన్సిల్ చైర్మన్



తిరుపతి ప్రెస్‌క్లబ్,డిసెంబర్ 7 ప్రభాతవార్త: ఏసు ప్రభువు ఈ లోకానికి వెలుగై ఉన్నాడని,ఆయన పంచిన ప్రేమను పది మందికి పంచడమే క్రిస్మస్ పండుగకు నిజమైన అర్థమని ఆంధ్రప్రదేశ్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ యలమంచిలి ప్రవీణ్ అన్నారు. బుధవారం కోనసీమ జిల్లాలోని అమలాపురం కల్వరి ప్రేయర్ హౌస్ నందు ఏపి బిషప్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఉభయ గోదావరి జిల్లాలు,కాకినాడ,కోనసీమ అంబేద్కర్ జిల్లాల బిషప్‌ల సమక్షంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను బిషప్ జార్జ్ పాపాఫ్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డా॥యలమంచిలి ప్రవీణ్ హాజరయ్యి ఏసు క్రీస్తు ఈ లోకానికి వచ్చిన కారణాలను వివరించారు.పది మంది పేదలకు సహాయం చేసేటటువంటి గుణాన్ని అలవర్చుకోవాలని సూచించారు.అనంతరం బిషప్స్ కౌన్సిల్ కార్యవర్గమంతా కలిసి క్యాండిల్స్ వెలిగించి,కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు బిషప్ బాలరాజు, కార్యదర్శి బిషప్ వానాల దేవిడ్,బిషప్ మోజెస్,బిషప్ విక్టర్ పాల్,బిషప్ నవీన్‌కుమార్,బిషప్ మోహన్‌రావు,బిషప్ ప్రసాద్,బిషప్ ప్రభుకుమార్,బిషప్ అభిషేక్,బిషప్ విజయ్‌కుమార్,బిషప్ రత్నకుమార్‌లు పాల్గొన్నారు.

## మైనారిటీ సోదరులకు తీపి కబురు -ఆ స్థలం మీకే ఎమ్మెల్యే



రేణిగుంట, డిసెంబరు 7 ప్రభాతవార్త: రేణిగుంట మైనారిటీ సోదరులకు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి బుధవారం తీపి కబురు చెప్పారు. ఆ కబురు విన్న మైనారిటీ మత పెద్దలు, సోదరులు ఆనందంతో పొంగిపోయారు. ఇంతకు ఆ తీపి కబురు ఏమిటంటే రేణిగుంట బిస్మిల్లా నగర్ సమీపంలోని వివేకానంద కాలనీ చివరిలో ఉన్న స్థలాన్ని యతింఖానాకు అధికారుల ద్వారా ఇప్పించడానికి సుముఖత వ్యక్తం చేశారు. దీంతో ఇంత కాలంగా జరుగుతున్న ప్రచారాలకు తెరపడింది. ఈ స్థలం ముస్లింలకు చెందినదిగా పార్టీలకతీతంగా ముస్లిం పెద్దలు శ్రీకాళహస్తి వెళ్లి ఎమ్మెల్యేకు తెలియజేశారు. తక్షణం ఆయన సానుకూలంగా స్పందించడంతో ముస్లిం పెద్దలు మైనారిటీ సోదరులు అమానుల్లా, జీకే మునీర్, అబ్దుల్‌ఖాదిర్, సుభాన్ రాజా, షబ్బీర్ అహ్మద్, అలీ, రసూల్, రఫీ ఉల్లా, షమీవుల్లా, ఏ.కరిముల్లా, యాసిన్, రహీం, ఐదు మసీదుల ముత్తవల్లీలు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలియజేస్తూ ఆయన చేత స్వీట్లు తినిపించారు. ఎమ్మెల్యే సూచనల మేరకు ఓ కమిటీగా ఏర్పడి స్థలాన్ని అభివృద్ధి చేస్తామని ముస్లిం మైనారిటీ సోదరులు తెలిపారు.

## కన్నులపండువగా శ్రీదత్తాత్రేయునికి క్షీరాభిషేకం



సూళ్లూరుపేట, డిసెంబర్ 7 ప్రభాతవార్త : సూళ్లూరు పేటలోని కస్వారెడ్డి పాలెంలో వెలసి ఉన్న శ్రీషిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ గురు దత్తాత్రేయ జయంతిని పురస్కరించుకొని బుధవారం స్వామివారికి 108 కలశాలతో క్షీరాభిషేకాన్ని కన్నులపండువగా నిర్వహిం చారు. గురుపారాయణం, శ్రీదత్తాత్రేయ హోమం, గురు పూజ వేడుకలను నిర్వహించారు. అనంతరం స్వామి వారికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంపతులు వ్యవహరించారు. అలాగే సాయినగర్‌లోని శ్రీషిరిడీ సాయి బాబా మందిరంలో దత్తజయంతి వేడుకలను కన్నులపండువగా జరిపారు. శ్రీనాగేశ్వరస్వామి దేవస్థా నంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఛైర్మన్ చెన్నారెడ్డి సుబ్రహ్మణ్యంరెడ్డి ఆధ్వర్య ంలో ఈ కార్యక్రమాలు జరిగాయి. చండీయాగం సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో పౌర్ణమిని పురస్కరిం చుకొని శ్రీమహాచండీ యాగాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ప్రాంగణంలోని యాగమండపంలో ముందుగా గోమాతకు పూజలు చేసిన అనంతరం వేదపండితుల మంత్రోచ్చరణల మధ్య శాస్త్రోక్తంగా యాగం నిర్వహించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగం ముగిసింది. ఉభయ కర్తలుగా డాక్టర్ సాయిబాబా, మస్తానమ్మ దంపతులు వ్యవహరించారు. ఏర్పాట్లను కార్యనిర్వహణ అధికారి ఆళ్ల శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

## ముఖ్యమంత్రికి ఘన స్వాగతం...వీడ్కోలు





రేణిగుంట, డిసెంబరు 7 ప్రభాతవార్త: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మో హన్‌రెడ్డికి బుధవారం రేణిగుంట విమానాశ్రయంలో అపూర్వ స్వాగతం లభించింది. సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కుమార్తె వివాహానికి శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కనుపర్తిపాడులో వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కన్వెన్షన్ హాలుకు వెళ్ళడానికి మధ్యాహ్నం ప్రత్యేక విమానంలో ఆయన రేణిగుంట విమానాశ్రయానికి చేరుకున్నారు. రాష్ట్ర భూగర్భ జనులు అటవీ విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనంతపూర్ రేంజ్ డీఐజీ రవిప్రకాష్, తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ అనుపమ అంజలి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, అడిషనల్ ఎస్పీ కులశేఖర్, శ్రీకాళహస్తి ఆర్డీవో రామారావు, డీఎస్పీలు రామచంద్రయ్య, సురేంద్ర, నందకిషోర్, ఎయిర్‌పోర్టు సీఎస్‌వో రాజశేఖర్, రేణిగుంట తహసీల్దార్ శివప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. రాష్ట్ర భూగర్భ, గనులు, అటవీ, విద్యుత్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి, జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతో కలసి నెల్లూరుకు హెలికాప్టర్‌లో బయలుదేరి వెళ్లారు. వివాహ మహోత్సవంలో పాల్గొని అదే హెలికాప్టర్‌లో రేణిగుంట వచ్చి ప్రత్యేక విమానంలో పలువురు మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు వీడ్కోలు పలుకుతుండగా మంత్రి అంబటి రాంబాబుతో విజయవాడకు బయలుదేరి వెళ్లారు.

## చింతలచేను రోడ్డు పనులను పూర్తి చేయండి : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, డిసెంబర్ 7 ప్రభాతవార్త : తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చింతల చేను మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కమిషనర్ అనుపమ అంజలి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తిరుపతి అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మాస్టర్ ప్లాన్ రోడ్ల స్థితిగతులపై పరిశీలనలో భాగంగా బుధవారం కమిషనర్ అనుపమ అంజలి చింతలచేను మాస్టర్ ప్లాన్ రోడ్డు పనులను పరిశీలిస్తూ రోడ్డు నిర్మాణానికి స్థలాలు ఇస్తున్న యజమానులకు ఏ మాత్రం ఆలస్యం కాకుండా టిడిఆర్ బాండ్లను మంజూరు అయ్యేటట్టు చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులు అభివృద్ధి చెందితే, వాటి చుట్టు పక్కలా వుండే భూములు కూడా అభివృద్ధి చెందడంతో బాటు నగరం కూడా అభివృద్ధితో విస్తరిస్తుందని విషయాన్ని మాస్టర్ ప్లాన్ రోడ్లు నిర్మించే ప్రాంతాల ప్రజలకు వివరించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ వెంట అదనపు కమిషనర్ సునీత, అసిస్టెంట్ సిటి ప్లానర్ బాలసుబ్రమణ్యం, ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి : డిఈవో



శ్రీకాళహస్తి, డిసెంబర్ 7 ప్రభాతవార్త : ఉచిత వైద్యశిబిరాలను ప్రత్యేక ప్రతిభావంతుల చిన్నారుల తల్లిదండ్రులు సద్వినియోగంచేసుకోవాలని డిఈవో డాక్టర్ శేఖర్ అన్నారు. బుధవారం పట్టణంలోని కొత్తపేటలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రత్యేక అవసరాలు కలిగిన 18ఏళ్ళ లోపు పిల్లలకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో వైద్యనిర్ధారణ పరీక్షలునిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ వి.శేఖర్ ప్రారంభించారు. డిఈవోకు ఎంఈవో భువనేశ్వరి స్వాగతం పలికారు. అనంతరం డిఈవో మాట్లాడుతూ ఎంతో అత్యధిక ఖర్చుతో కూడుకున్న ఈచికిత్సలను ప్రభుత్వం ఉచితంగా ప్రత్యేక ప్రతిభావంతులకు ఉచితంగా చేయించడం సంతోషమన్నారు. ఈశిబిరంలో మస్కిష్కపక్షవాతం, బుద్ధిమాంద్యత, బదిరులు, దృష్టిలోపం, వినికిడిలోపం, నరాలకు సంబంధించిన లోపాలు కలిగిన పిల్లలకు నిపుణులైన వైద్యబృందం డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ హర్షతేజరెడ్డి, డాక్టర్ శ్రీనివాసులు, డాక్టర్ ఉదయ్‌కిరణ్, డాక్టర్ నీరజ, దీప్తిచరిష్మాలచే వైద్యపరీక్షలు నిర్వహించడం అభినందనీయం అన్నారు. వైద్యనిపుణుల సూచనల మేరకు ఉపకరణాలు అవసరమైన పిల్లలకు సమగ్ర శిక్ష తిరుపతి జిల్లా ఆధ్వర్యంలోఉపకరణాలు అందిస్తామన్నారు. వైద్యపరీక్షల్లో బుద్ధిమాంద్య 8, బదిరులు 34, మస్తిష్కపక్షవాతం 22, దృష్టిలోపం 5మంది చిన్నారులకు ఉన్నట్లు గుర్తించి వారికి ఉపకరణాలు అందిస్తామన్నారు. ఈశిబిరంలో సహిత ఇన్‌ఛార్జి సమన్వయకర్త రామచంద్రారెడ్డి, మరియు ఐఈఆర్‌టిలు జనార్దన్, మజ్ను, పాఠశాల హెచ్‌ఎం చంద్రబాబు, సిఆర్‌పిలు పాల్గొన్నారు.

## మహానందీశ్వర, కన్నప్ప సర్కిల్స్ ఏర్పాటుకు పరిశీలన



శ్రీకాళహస్తి,డిసెంబర్ 7 ప్రభాతవార్త : దక్షిణ కైలాసంగా ప్రఖ్యాతి గాంచిన శ్రీకాళహస్తీశ్వరాలయానికి విచ్చేస్తున్న లక్షలాది మంది భక్తులకు దివ్యక్షేత్రం ప్రాశస్త్యం తెలిసే విధంగా పట్టణ పొలిమేరల్లో ఏర్పాట్లు చేయాలని ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధికారులకు ఆదేశించారు. ముఖ్యంగా విజయవాడ, చెన్నై వైపుల నుంచి విశేష సంఖ్యలో భక్తులు వస్తుంటారు. విజయవాడ వైపు నుంచి వచ్చే భక్తులకు సంకేతంగా 'మహానందీశ్వరుని విగ్రహాన్ని' అలాగే చెన్నై నుంచి వచ్చే భక్తులకుసంకేతంగా ఎంజిఎం ఆసుపత్రి సర్కిల్ వద్ద భక్త కన్నప్ప విగ్రహాన్ని ఏర్పాటు చేసే విధంగా స్థలాన్ని పరిశీలించారు.ఈ మేరకు బుధవారం ఆలయాధికారులు దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు కలసి రెండు చోట్ల స్థలాన్ని పరిశీలించారు.అయితే రెండు రోడ్లు ఆర్‌అండ్‌బికి సంబంధించినవి కావటంతో ఆ శాఖ అధికారులనుకూడా ఆహ్వానించి పరిశీలన జరిపారు. ఈ రెండు మలుపుల వద్ద ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా విగ్రహాలు ఏర్పాటు చేసే విధంగా మార్కింగ్ చేసారు.ఈ పరిశీలనల్లో చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులుతో పాటు ఆర్‌అండ్‌బి డిఇఇ శ్రీనివాసులు, దేవస్థానం డిఇఇ వేణుగోలపాల్,వర్క్ ఇన్స్‌పెక్టర్ ప్రతాప్,కాంట్రాక్టర్ తేజ,హరి తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి గ్రాప్లింగ్ కుస్తీ పోటీలలో విద్యార్థినుల ప్రతిభ



తిరుపతి (విద్య), డిసెంబర్ 7 ప్రభాతవార్త : నవంబర్ 24 నుంచి 27వ తేది వరకు అయోధ్యలోని నందిని నగర్‌లో రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన రెండవ జాతీయ స్థాయి క్యాడేట్, జూనియర్ బాల బాలికల గ్రాప్లింగ్ కుస్తీ ఛాంపియన్ షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తానికి 50 మెడల్స్ వస్తే అందులో 11 మెడల్స్ శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినులు కైవసం చేసుకుని కళాశాల చరిత్రలోనే సరికొత్త రికార్డును సృష్టించారు. వారి వివరాలు ఇలా ఉన్నారు. వి. రుచిత, బి.భవ్య శ్రీ సిల్వర్ మెడల్స్, టి. అనూష, టి సాయి శ్రీ, జి. నవ్య, పి. తనూజ బాయి, డి బిందు శ్రీ, ఎం పల్లవి, టి. పావని, బ్రాంజ్ మెడల్స్ సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన వీరందరిని టీటీడి జేఈఓ సదా భార్గవి, టిటిడి డిఈఓ డాక్టర్ ఎం. భాస్కర్ రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి. భువనేశ్వరి అభినందించి, చదువుతోపాటు క్రీడల్లో కూడా జాతీయ అంతర్జాతీయ స్థాయిలో ఇదే పోరాటపటిమతో రాణించాలని రాష్ట్రానికి, టిటిడి విద్యా సంస్థలకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని విద్యార్థులను ఉత్తేజపరిచారు. అధ్యాపకులంతా అభినందించి హర్షం వ్యక్తం చేసారు.

## జోనల్‌లో సత్తా చాటిన నగరి క్రీడాకారులు : మంత్రి రోజా



నగరి, డిసెంబరు 7 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్ర క్రీడా శాఖ తరపున ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న క్రీడా సంబరాల్లో నగరి క్రికెట్ క్రీడాకారులు ప్రతిభ కనపరిచారు. కర్నూలులోని మదర్ థెరిస్సా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పారా మెడికల్ అండ్ రిసెర్చ్ కాలేజీ మైదానంలో నిర్వహించిన జోనల్ స్థాయి క్రికెట్ పోటీల్లో సత్యసాయి జిల్లా జట్టుపై గెలిచి చిత్తూరు జిల్లాకు చెందిన నగరి క్రీడాకారులు సత్తా చాటారు. బుధవారం హోరాహోరీగా జరిగిన మ్యాచ్‌లో సత్యసాయి జిల్లా జట్టు 20 ఓవర్లలో 175 పరుగులు చేయగా, చిత్తూరు జిల్లా నుంచి ఎంపికైన నగరి జట్టు 19.3 ఓవర్లలో 176 పరుగులు చేసి విజేతగా నిలిచింది. జట్టులో పవన్‌కుమార్ (46), ప్రశాంత్ (40) పరుగులు చేసి ప్రతిభ కనపరిచారు. విజేతగా నిలిచిన నగరి జట్టుకు రాష్ట్ర పర్యాటక, క్రీడా శాఖ మంత్రి ఆర్.కె.రోజా ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.